
# DD9 వార్త
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 245 | హైదరాబాద్, ఏప్రిల్, శుక్రవారం 24, 2026 | పేజీలు : 06 వెల : 3.00


## బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయం



- ఎన్నికల వేళ ప్రధాని మోదీ ధీమా
- కృష్ణానగర్ సభలో టీఎంసీపై ఆగ్రహం
- ఝాల్‌మురి వ్యాఖ్యతో రాజకీయ వ్యంగ్యం
- చొరబాటుదారులకు టీఎంసీ ఆశ్రయం ఇస్తోందని ఆరోపణ
- సబ్‌కా సాత్ వర్సెస్ సిండికేట్ పాలనపై విమర్శలు
- సీఏఏ అమలు వేగవంతం చేస్తామని హామీ
- శరణార్థులు, మతువా, నమశూద్రులకు భరోసా
- శాంతియుత పోలింగ్‌పై ఎన్నికల సంఘానికి ప్రశంసలు

## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం



- సైబర్ మోసాల కట్టడిపై బ్యాంకులతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమావేశం
- 'జీరో మూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకులకు ఆదేశం
- అకౌంట్ల సంఖ్య కన్నా పౌర భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- మోసాలకు సహకరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- విదేశాల కేంద్రంగా సైబర్ మోసాలు.. బ్యాంకు అధికారుల పాత్రపై సీపీ ఆందోళన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే ..మిగతా 2లో

## మక్క రైతు విలవిల



- ఎకరాకు 26 కింటాళ్ల పంటనే కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్
- క్వింటాల్‌కు రూ.1,700కే పరిమితమైన మార్కెట్ ధరలు
- మద్దతు ధర ఉన్నా రైతులకు చేరని లాభం
- 226 కొనుగోలు కేంద్రాలు ఉన్నా, ఇప్పటివరకు తక్కువ కొనుగోళ్లు
- దూర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు, తేమ నిబంధనలతో ఆలస్యం
- దీంతో తక్కువ ధరకు ప్రైవేట్‌కు అమ్ముకుంటున్న రైతులు
- మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటూ నామమాత్రమే


**హైదరాబాద్, (డిడి9 వార్త):** మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత యాసంగితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. రాష్ట్రంలో 12.94 లక్ష ఎకరాల్లో మక్కలు సాగు చేశారు. దాదాపు 39 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 226 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 28,041 మంది రైతుల దగ్గర నుంచి 1,46,900 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. పంట దిగుబడి బాగుందని సంతోషించేలోపే డిమాండ్ తగ్గడంతో బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.1,700కు మించడం లేదు. దీంతో ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను దశలవారీగా ఏర్పాటు చేస్తోంది. కానీ అరకొరగానే కేంద్రాలు ఏర్పాటు చేయడం, అవి కూడా అవసరమైన ప్రాంతాల్లో కాకుండా దూరంగా ఏర్పాటు చేయడం.. ఆపై తేమ శాతం నిబంధనతో రోజుల తరబడి ఆరబెడుతూ రైతులు ఎదురుచూస్తున్నారు. ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ ఇటీవల కొణిజర్ల, సోమవారం బోనకల్ మండలం ముష్టికుంట్లలో రైతులు రాస్తారోకో చేశారు. యాసంగిలో మొక్కజొన్న ఎకరాకు 40 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఎకరాకు 26.50 క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని నిబంధన విధించింది. దీంతో నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లో చాలామంది రైతులు ధర తక్కువ అయినా ..మిగతా 2లో

## అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకంపై ఉత్కంఠ



- గవర్నర్ నిర్ణయంపై కాంగ్రెస్ వ్యూహాత్మక చర్చలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్‌పై పెండింగ్
- 6 నెలల గడువు నేపథ్యంలో మంత్రి పదవికి ప్రమాదం
- కోదండరామ్, అజార్ పేర్లపై ప్రభుత్వ సిఫారసు
- గవర్నర్ శుక్లా నిర్ణయంపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- ప్లాన్–బీపై కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహ రచన
- రాజీనామా చేసి తిరిగి ప్రమాణ స్వీకారం ఆలోచన
- న్యాయపరమైన అభ్యంతరాలతో పెండింగ్‌లో ఫైల్
- కేబినెట్ సమావేశంలో కీలక చర్చకు అవకాశం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల అంశం రాజకీయంగా ఉత్కంఠ రేపుతోంది. మాజీ క్రికెటర్, మంత్రి అజారుద్దీన్ ఎమ్మెల్సీ పదవిపై ఇంకా స్పష్టత రాకపోవడంతో కాంగ్రెస్ వర్గాల్లో అనిశ్చితి నెలకొంది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆయనను ఎమ్మెల్సీగా నియమిస్తారా లేదా అనే ప్రశ్నపై పార్టీ నేతల్లో చర్చ కొనసాగుతోంది. ఈ నెల 30లోపు ఎమ్మెల్సీగా నామినేట్ కాకపోతే ..మిగతా 2లో



### రాజకీయాల నుంచి తప్పుకుంటే బెటర్..

- ఖర్గే రాహుల్ గాంధీ కనుసన్నల్లో నడుస్తున్నాడన్న రాంచందర్ రావు
- వయసు రీత్యా రిటైర్మెంట్ తీసుకోవడం బెటర్ అని ఎద్దేవా
- కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

2

## పాలేరులో ప్రజా దర్బార్‌కు శ్రీకారం

- ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా మంత్రి పొంగులేటి ఆవిష్కరణ
- ఇందిరమ్మ ఆశయాన్ని అమలు చేస్తున్న ప్రజా పాలన నమూనా
- అన్ని శాఖల అధికారులు ఒకే వేదికపై సమస్యల పరిష్కారం
- క్షేత్రస్థాయిలో తక్షణ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఏర్పాటు
- రాయిగూడెం, సుబ్లేడు కేంద్రాల్లో ప్రజా దర్బార్ నిర్వహణ
- గ్రామాల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు
- కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కొత్త విధానం
- అధికారులకు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశాలు
- ప్రజా పాలనలో పారదర్శకత, వేగవంతమైన సేవల లక్ష్యం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** "ప్రభుత్వం అంటే ప్రజల కోసం, ప్రజల వద్దకే పాలన" అనే ఇందిరమ్మ ఆశయాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తూ పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సరికొత్త ప్రజా పాలనకు శ్రీకారం చుట్టారు. సామాన్య ప్రజలు చిన్న చిన్న సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అధికారులే ప్రజల వద్దకు వెళ్లే విధంగా 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం ..మిగతా 2లో

### ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి వాహనాలపైకి దూసుకెళ్లిన ట్రక్కు
- రెండు కార్లను ట్రక్కు ఢీకొట్టడంతో మంటలు
- సజీవదహనమైన 11 మంది దుర్మరణం
- రెండు ట్రక్కుల మధ్య చిక్కుకుని నుజ్జునుజ్జైన కార్లు
- క్షణాల్లో మంటలు వ్యాపించి బూడిదైన వాహనాలు
- పలువురికి గాయాలు.. ఆస్పత్రులకు తరలించిన పోలీసులు
- బ్రేకులు ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక నిర్ధారణ



2

## ముదురుతున్న ఆర్టీసీ సమ్మె

### రెండో రోజుకూడా నిలిచిపోయిన బస్సుల రాకపోకలు




- హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రవాణా వ్యవస్థ
- ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సులు బంద్
- డిపోలకే పరిమితమైన వాహనాలు..
- అద్దె బస్సులతో యాజమాన్యం ప్రయత్నాలు
- బస్టాండ్లలో గంటల తరబడి ఎదురు చూస్తున్న ప్రయాణికులు
- ప్రైవేటు ట్రావెల్స్, ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన డిమాండ్
- అధిక ఛార్జీలతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం
- డిమాండ్లపై హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్న కార్మికులు
- డిపోల వద్ద పోలీసు బందోబస్తు.. ఉద్రిక్త పరిస్థితులు

**హైదరాబాద్, (డిడి9 వార్త):** సమస్యల పరిష్కారం, పెండింగ్ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఐకాస పిలుపునిచ్చిన సమ్మె రెండో రోజుకూడా ఉధృతంగా కొనసాగుతోంది. కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సుల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఈ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర రాజధానిలోని ప్రధాన బస్ టెర్మినళ్లు అయిన ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి సాధారణంగా నడిచే ఆర్టీసీ బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. రోజువారీ వేల సంఖ్యలో ప్రయాణికులు ఉపయోగించే ఈ కేంద్రాలు ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. సమ్మె విషయం తెలియక వచ్చిన కొంతమంది ప్రయాణికులు బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమ్మె ప్రభావం నగరంతోపాటు ..మిగతా 2లో

## మోదీ సర్కార్‌ది డబుల్ వైఫల్యం

- ప్రమాదంలో ఎరువులు, ఇంధన భద్రత
- మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు
- డీలిమిటేషన్ పేరుతో ప్రజల దృష్టి మళ్లించారు
- పడిపోయిన ముడిచమురు, గ్యాస్ ఉత్పత్తి
- హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న 14 భారత నౌకలు
- ఎరువుల కొరతతో రైతులకు తీవ్ర ఇబ్బందులు
- దిగుమతుల వైవిధ్యీకరణలో ప్రభుత్వం విఫలం
- చైనా, రష్యా నిర్ణయాలతో సరఫరా సంక్షోభం తీవ్రం
- ప్రధాని వ్యాఖ్యలపై ఈసీ నోటీసులకు ఖర్గే స్పందన



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):** కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. దేశ ప్రజలకు ఇంధన భద్రత, ఎరువుల భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ముందుకు తెచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దేశంలో ఇంధన ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిందని, దిగుమతుల వైవిధ్యీకరణ పూర్తిగా విఫలమైందని ..మిగతా 2లో

# మక్క రైతు విలవిల



మొదటిపేజీ తరువాయి

ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించారు.

**అమ్ముకోవడానికి అవస్థలు..**

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన పండగ కొండలరావు యాసంగిలో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే ఈదురు గాలులు, వర్షాలతో కంకి దశలో నేలమట్టమైంది. అయినా ఎకరానికి రూ.10 వేల చొప్పున 12 ఎకరాలకు రూ.1.20 లక్షలు కూలి చెల్లించి పంట కోయించి మొక్కజొన్న కల్లంలో ఆరబోసి 20 రోజులైంది.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాక రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. గతంలో స్థానిక సొసైటీకి కొనుగోలు కేంద్రం ఇచ్చినా, ఈసారి 5 కి.మీ. దూరంలోని బోనకల్‌కు కేటాయించారు. అక్కడకు తీసుకెళ్లాలంటే ఎకరా పంటకు రూ.3 వేలు అదనంగా ఖర్చవుతుందని వాపోతున్నాడు.

**వారమైనా తూకమేదీ?**

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు ఎర్రోళ్ల విజయ. ఈమెది సిద్దిపేట జిల్లా తొగుట మండలం గణపురం. వారం రోజుల క్రితం మక్కలను సిద్దిపేట మార్కెట్‌కు తీసుకొచ్చింది. శనివారం కొనుగోలు చేస్తామని ఎంపిక చేశారు. కానీ ఇప్పటి వరకు తూకం వేయలేదు.

## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం



మొదటిపేజీ తరువాయి

లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్‌ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా (KPIs) తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు.

సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ (cybercrime.gov.in) గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు. కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

## మోదీ సర్కార్‌ది డబుల్ వైఫల్యం



మొదటిపేజీ తరువాయి

ఖర్గే ఆరోపించారు. 2014-15 నుంచి దేశ ముడిచమురు ఉత్పత్తి దాదాపు 22 శాతం పడిపోయిందని, గ్యాస్ ఉత్పత్తి సుమారు 40 శాతం తగ్గిందని గణాంకాలను ప్రస్తావించారు. 2011-12లో గ్యాస్ ఉత్పత్తి 47,555 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లుగా ఉండగా, 2020-21 నాటికి అది 28,672 ఎంఎంఎస్‌సీఎంకు తగ్గిందని పేర్కొన్నారు.హర్మూజ్ జలసంధిలో భారత జెండా ఉన్న 14 నౌకలు చిక్కుకుపోయాయని, అవి 54 రోజులుగా అక్కడే నిలిచిపోయాయని ఖర్గే వెల్లడించారు. దేశం ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు.

ఎరువుల అంశంపైనా ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలో పలు సీజన్లలో ఎరువుల కొరత కొనసాగుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రపంచ స్థాయిలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగకముందే దేశంలో ఎరువుల సరఫరా సమస్యలు ఉన్నాయని గుర్తుచేశారు. ఎరువుల ఉత్పత్తి ఐదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిందని పేర్కొన్నారు.చైనా ఇప్పటికే ప్రత్యేక ఎరువుల ఎగుమతులపై ఆంక్షలు విధించిందని, రష్యా కూడా ఎగుమతులను నిలిపివేసిందని ఖర్గే ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా దిగుమతుల మార్గాలను విభిన్నీకరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఈ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి, ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని ఖర్గేను ఆదేశించింది. దీనిపై ఆయన స్పందిస్తూ నోటీసు వచ్చిన తర్వాత గురువారం సాయంత్రం సమాధానం ఇస్తామని తెలిపారు. ఈ అంశం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఖర్గే వ్యాఖ్యలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్రంగా స్పందించారు. వరుస ఎన్నికల ఓటముల కారణంగా కాంగ్రెస్‌లో ఏర్పడిన నిరాశే ఇలాంటి వ్యాఖ్యలకు కారణమని ఆయన విమర్శించారు. ప్రధానికి ఖర్గే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించడంలో కాంగ్రెస్ అతి చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

## పాలేరులో 'ప్రజా దర్బార్'కు శ్రీకారం



మొదటిపేజీ తరువాయి

అందించడమే లక్ష్యంగా నిర్ణయించారు.

ఈ ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై హాజరుకానున్నారు. రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన విజ్ఞప్తులు, రేషన్ కార్డులు, స్థానిక మౌలిక సదుపాయాలు వంటి అన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పర్యవేక్షించే విధంగా మానిటరింగ్ యంత్రాంగం కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఈ నెల 25వ తేదీన రెండు ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం రాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి దర్బార్ జరగనుంది. ఈ కార్యక్రమానికి నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు హాజరుకానున్నారు. మధ్యాహ్నం సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో దర్బార్ నిర్వహించనున్నారు. ఈ వేదికకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు తమ సమస్యలతో తరలిరానున్నారు. గ్రామాల వారీగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో అధికారులు పూర్తిసిద్ధతతో రావాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన సమాచారం, రికార్డులతో అధికారులు క్షేత్రస్థాయికి రావాలని సూచించారు. ప్రజల సమస్యలను వాయిదా వేయకుండా అక్కడికక్కడే పరిష్కరించాలనే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.తన నియోజకవర్గంలో ఒక్క పౌరుడు కూడా సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకూడదనే లక్ష్యంతో ఈ ప్రజా దర్బార్ ప్రారంభించామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజలకు చేరాలన్నదే ఈ కొత్త పాలన విధాన ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

## ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీర్జాపూర్ జిల్లాలో బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్రాన్ని కలవరపరిచింది. ఒక ట్రక్కు అదుపుతప్పి మరో ట్రక్కుతో పాటు రెండు కార్లపైకి దూసుకెళ్లడంతో సంభవించిన ఈ ప్రమాదంలో 11 మంది సజీవదహనమవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాహనాలు పూర్తిగా దగ్ధమవగా, లోపల చిక్కుకున్న వారు బయటకు రావడానికి అవకాశమే లేకపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డ్రామాండ్‌గంజ్ లోయ నుంచి లాసోడా ప్రాంతం వైపు వెళ్తున్న రహదారిపై చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఓ ట్రక్కు అకస్మాత్తుగా అదుపుతప్పి ముందున్న మరో ట్రక్కు మరియు రెండు కార్లను ఢీకొట్టింది. ఢీకొన్న దెబ్బకు కార్లు రెండు ట్రక్కుల మధ్య ఇరుక్కుపోయి పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కార్లలో నుంచి మంటలు చెలరేగాయి. ఇంధనం లీక్ కావడం, ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటం వల్ల క్షణాల్లోనే మంటలు అన్ని వాహనాలకు వ్యాపించాయి. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వాహనాల్లో ఉన్నవారు బయటపడే అవకాశం లేకపోయింది. దీంతో 11 మంది అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. ఈ దృశ్యాలు అక్కడి ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ ప్రమాదంలో మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణాలపై పోలీసులు ప్రాథమికంగా దర్యాప్తు చేపట్టగా, ట్రక్కు బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మీర్జాపూర్ జిల్లా ఎస్పీ అపర్ణ రజత్ కౌశిక్ మాట్లాడుతూ, బ్రేక్ వ్యవస్థలో లోపం కారణంగా ట్రక్కు నియంత్రణ కోల్పోయి ఉండొచ్చని తెలిపారు. పూర్తి స్థాయి దర్యాప్తు తర్వాత మాత్రమే ఖచ్చితమైన కారణం వెల్లడవుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రమాదంలో పాల్గొన్న వాహనాల వివరాలను కూడా పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కుకు బిహార్ రాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ ఉండగా, మరో ట్రక్కు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. ఢీకొన్న రెండు కార్లలో ఒకటి సోన్‌భద్ర జిల్లాకు చెందినదిగా, మరొకటి మీర్జాపూర్ జిల్లాకు చెందినదిగా అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో జరిగిన విధ్వంసం తీవ్రతను చూస్తే ప్రమాదం ఎంత భయానకంగా జరిగిందో అర్థమవుతుంది. పూర్తిగా కాలిపోయిన వాహనాల అవశేషాలు, చుట్టుపక్కల ప్రాంతంలో వ్యాపించిన పొగ, మంటల ఆనవాళ్లు అక్కడి పరిస్థితిని స్పష్టంగా చూపించాయి. స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొని గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ట్రక్కు యజమానులు, డ్రైవర్లపై బాధ్యతను నిర్ణయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే వాహనాల సాంకేతిక లోపాలపై కూడా సమగ్ర విచారణ చేపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో రహదారి భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. భారీ వాహనాల సాంకేతిక స్థితి, డ్రైవర్ల నిర్లక్ష్యం, వేగ నియంత్రణ వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొండప్రాంతాల్లో ప్రయాణించే వాహనాలకు ప్రత్యేక భద్రతా ప్రమాణాలు అవసరమని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే మీర్జాపూర్‌లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఒకే ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం స్థానికులను, అధికారులను కలచివేసింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకంపై ఉత్కంఠ



మొదటిపేజీ తరువాయి

అజారుద్దీన్ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

గవర్నర్ కోటాలో అజారుద్దీన్‌తో పాటు కోదండరామ్ పేర్లను రాష్ట్ర మంత్రివర్గం గత ఏడాది ఆగస్టులో సిఫారసు చేసింది. అయితే ఈ ఫైల్‌పై న్యాయపరమైన అభ్యంతరాలు, కేసులు ఉండటంతో ఇప్పటికీ గవర్నర్ వద్ద పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసి ఈ ఫైల్‌ను ఆమోదించాలని కోరినట్లు తెలిసింది. అయినప్పటికీ నిర్ణయం వెలువడకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.చట్టసభ సభ్యుడు కాని వ్యక్తి మంత్రి అయితే ఆరు నెలల్లో ఏదైనా సభలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అజారుద్దీన్‌కు గడువు దగ్గరపడుతోంది. ఆయనను ఎమ్మెల్సీగా నామినేట్ చేయకపోతే రాజీనామా తప్పనిసరి అవుతుంది. ఇదే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యామ్నాయ వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, అజారుద్దీన్‌ను తాత్కాలికంగా మంత్రి పదవి నుంచి రాజీనామా చేయించి, మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించే ప్లాన్-బీపై చర్చ జరుగుతోంది. ఈ విధంగా చేస్తే మరో ఆరు నెలల పాటు ఆయన మంత్రి పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. ఈ వ్యూహాన్ని మే మొదటి వారంలో అమలు చేసే అవకాశముందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గవర్నర్ నిర్ణయం ఆలస్యం కావడానికి పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. అజారుద్దీన్ గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆర్థిక అక్రమాల ఆరోపణలు వచ్చాయని, ఈ అంశంపై ఫిర్యాదులు కూడా చేరినట్లు సమాచారం. దీంతో ఫైల్‌ను పూర్తిగా క్లియర్ చేయాలా లేక పాక్షికంగా ఆమోదించాలా అనే అంశంపై గవర్నర్ కార్యాలయంలో పరిశీలన కొనసాగుతోంది.

ఈ అంశంపై ఈ రోజు జరిగే మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ జరిగే అవకాశం ఉంది. కోదండరామ్, అజారుద్దీన్ పేర్లను మరోసారి సిఫారసు చేయాలా లేక ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలా అనే విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పార్టీ అధిష్టానం కూడా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది.కాంగ్రెస్ వర్గాల్లో ప్రస్తుతం ప్రధాన చర్చ గవర్నర్ నిర్ణయం ఎప్పుడు వెలువడుతుందనే అంశంపైనే కొనసాగుతోంది. ఒకవేళ కోదండరామ్‌కు మాత్రమే గ్రీన్ సిగ్నల్ వస్తే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. అజారుద్దీన్ విషయంలో మాత్రం తుది నిర్ణయం ఇప్పటికీ స్పష్టతకు రాకపోవడంతో అనిశ్చితి కొనసాగుతోంది.

## ముదురుతున్న ఆర్టీసీ సమ్మె



మొదటిపేజీ తరువాయి

జిల్లాల్లో కూడా తీవ్రంగా ఉంది. కార్మికులు డిపోల వద్దే ఆందోళనకు దిగడంతో బస్సులు బయటకు రాకపోవడం గమనార్హం. దీంతో ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సులను రోడ్డెక్కించేందుకు ప్రయత్నిస్తున్నా, అవి సరిపోకపోవడంతో రవాణా సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు.

హైదరాబాద్‌లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. సాధారణంగా రద్దీగా ఉండే బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోతున్నా, బస్సులు లేకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు, ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు.

ఇక ఎంజీబీఎస్ నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన బస్సులు పరిమితంగా నడుస్తున్నాయి. దీని వల్ల ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారికి కొంత ఉపశమనం లభిస్తున్నా, స్థానిక రవాణా పూర్తిగా దెబ్బతింది.

బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఆటోలు, క్యాబ్‌లు, ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వాహనదారులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ధరలకంటే రెట్టింపు వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పీక్ అవర్స్ సమయంలో పరిస్థితి మరింత దిగజారుతోంది. సమయానికి కార్యాలయాలకు చేరుకోలేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతుండగా, విద్యార్థులు విద్యాసంస్థలకు హాజరుకావడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలు కూడా లేకపోవడంతో ప్రజలు పూర్తిగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసర పనుల కోసం వెళ్లాల్సినవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరోవైపు ఆర్టీసీ కార్మికులు తమ సమ్మెపై కట్టుదిట్టంగా నిలబడ్డారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే సమ్మె కొనసాగుతుందని ప్రకటిస్తున్నారు. వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, సేవా నిబంధనల మార్పులు వంటి అంశాలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సమ్మె నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

ఇక ఆర్టీసీ యాజమాన్యం పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగిస్తోంది. తాత్కాలిక డ్రైవర్లు, కాంట్రాక్ట్ సిబ్బందితో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నా, సమ్మె ప్రభావం కారణంగా అవి పరిమితంగానే ఉన్నాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ ఆర్టీసీ సమ్మె రెండో రోజుకూడా రాష్ట్ర రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తుండగా, మరోవైపు సాధారణ ప్రజలు నిత్యజీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యకు త్వరితగతిన పరిష్కారం దొరకాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## రాజకీయాల నుంచి తప్పుకుంటేే బెటర్..

- ఖర్గే రాహుల్ గాంధీ కనుసన్నల్లో నడుస్తున్నాడన్న రాంచందర్ రావు
- వయసు రీత్యా రిటైర్మెంట్ తీసుకోవడం బెటర్ అని ఎద్దేవా
- కాంగ్రెస్ కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య



హైదరాబాద్, (డిడి9 వార్త):

ఎన్నికల వేళ రాజకీయ విమర్శలు తారస్థాయికి చేరుకున్నాయి. ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో, కేంద్ర ఎన్నికల సంఘం ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామంపై తెలంగాణ బీజేపీ నేత రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. ఖర్గే గా తన సొంత నిర్ణయాలతో కాకుండా, పూర్తిగా రాహుల్ గాంధీ కనుసన్నల్లోనే నడుస్తున్నారని ఆయన ఆరోపించారు. వయసు రీత్యా ఆయన రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవడం ఉత్తమమని, ఆయన చేసే ప్రతి తప్పుడు ప్రకటనకు రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

మరోవైపు, నేడు పశ్చిమ బెంగాల్ లోక్‌సభ తొలి దశతో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బెంగాల్ ఓటర్లు ఎటువంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాంచందర్ రావు కోరారు. ఎన్నికల సంఘం అక్కడ పటిష్ఠమైన భద్రత కల్పించిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మే 4న వెలువడబోయే ఫలితాలు ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీకి సానుకూలమైన భారీ మార్పును తీసుకువస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయం

- ఎన్నికల వేళ ప్రధాని మోదీ ధీమా
- కృష్ణానగర్ సభలో టీఎంసీపై ఆగ్రహం
- ఝాల్‌మురి వ్యాఖ్యతో రాజకీయ వ్యంగ్యం
- చొరబాటుదారులకు టీఎంసీ ఆశ్రయం ఇస్తోందని ఆరోపణ
- సబ్‌కా సాత్ వర్సెస్ సిండికేట్ పాలనపై విమర్శలు
- సీఏఏ అమలు వేగవంతం చేస్తామని హామీ
- శరణార్థులు, మతువా, నమశూద్రులకు భరోసా
- శాంతియుత పోలింగ్‌పై ఎన్నికల సంఘానికి ప్రశంసలు

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

బంగాల్‌లో రెండో దశ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నదియా జిల్లా కృష్ణానగర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో మార్పు కోసం ప్రజలు భారీగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈసారి బంగాల్‌లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచార ప్రసంగంలో మోదీ వ్యంగ్య వ్యాఖ్యలు కూడా చేశారు. తాను ఇటీవల ఝాల్‌మురి తిన్నానని, అయితే దాని ఘాటు తృణమూల్ కాంగ్రెస్‌కే తగిలిందని అన్నారు. ఈ వ్యాఖ్య సభలో చర్చకు దారి తీసింది. టీఎంసీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, మార్పు అవసరమని ప్రజలు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బంగాల్‌లో శాంతి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం ప్రజలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం ఇస్తోందని, దీనివల్ల రాష్ట్రంలో అస్థిరత పెరుగుతోందని మోదీ ఆరోపించారు. దీన్ని "జంగిల్ రాజ్"గా అభివర్ణిస్తూ, అవినీతి మరియు అణచివేత పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజల ప్రయోజనాలకు బదులుగా సిండికేట్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వనరులు దోపిడీకి గురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" విధానాన్ని ప్రజలకు గుర్తుచేశారు. కానీ టీఎంసీ పాలనలో "చొరబాటుదారుల అభివృద్ధి" అనే విధానం కొనసాగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మే 4 తర్వాత బంగాల్‌లో సుపరిపాలన ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అనేక జిల్లాల్లో టీఎంసీ ఖాతా కూడా తెరవలేదని జోస్యం చెప్పారు.

ప్రధానమంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టం అమలు ప్రక్రియను వేగవంతం చేస్తామని ప్రకటించారు. శరణార్థులు, మతువా, నమశూద్ర వర్గాలకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. భారతదేశానికి ఆశ్రయం కోరుతూ వచ్చిన ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి పౌరుడికి లభించే హక్కులు, ప్రయోజనాలు వీరికీ అందుతాయని స్పష్టం చేశారు.మోదీ "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ స్థానిక ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. కానీ టీఎంసీ పాలనలో ప్రతి జిల్లాలో సిండికేట్ వ్యవస్థే పెరిగిందని విమర్శించారు. ఈ సిండికేట్ వ్యవస్థ వ్యాపారాలను అడ్డుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెడుతోందని ఆరోపించారు.

మొదటి దశ పోలింగ్‌లో భారీ ఓటింగ్ నమోదైనందుకు బంగాల్ ప్రజలకు ప్రధాని అభినందనలు తెలిపారు. ఇది మార్పు కోసం ప్రజల బలమైన సంకల్పానికి సంకేతమని చెప్పారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల సంఘాన్ని ఆయన ప్రశంసించారు. గతంలో హింసాత్మక వాతావరణం ఉన్న ఎన్నికల పరిస్థితులు ఇప్పుడు మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో ఓటు వేయడం వల్ల బీజేపీకి అనుకూల ఫలితాలు వస్తాయని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. బంగాల్ ప్రజలు ఈసారి కొత్త చరిత్ర రాయబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.



## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి : ఏఐపీకేఎంఎస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జి.దేవయ్య డిమాండ్ చేశారు. గురువారం సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును ఆ సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ.. ఎర్రటి ఎండలో కూలీలు పని చేస్తున్నా కనీసం నీడ కోసం టెంట్లు వేయలేదని, తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా లేదని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు గాయాలైనా, ఎండదెబ్బ తగిలినా చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు అవసరమైన పనిముట్లు ఇవ్వకపోగా ఉదయం మరియు సాయంత్రం రెండు సార్లు సంతకాలు సేకరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. చేసిన పనికి వారం వారం వేతనాలు రాక కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో టెంట్లు, నీరు, వైద్య కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సిహెచ్ రమేష్, డివిజన్ నాయకులు లాలయ్య, టి. లాలు తదితరులు పాల్గొన్నారు.





## నోటీసుల పేరుతో గొంతు నొక్కడం తగదు : సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు ఎన్ఐఏ విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేయడాన్ని ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం సాలూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి నేటి వరకు రంగారావు ప్రజల కోసం చేస్తున్న పోరాటాలు, ఉద్యమాలు అందరికీ తెలిసినవేనని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆయన ఆరోపించారు. వీటిని ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక వాదులు, ఉద్యమకారుల గొంతులను నొక్కేందుకు, విచారణ పేరిట నోటీసులతో భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగానికి కట్టుబడి పాలన సాగించాల్సిన కేంద్రం, ఇలాంటి బెదిరింపు చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని అన్నారు. రంగారావుకు పంపిన విచారణ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.హెచ్. రమేష్, జి. దేవయ్య, లాలయ్య, బి. లక్ష్మణ్, టి. లాలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల గొంతుక నూర్జహాన్.. సేవలను స్మరించుకున్న వికలాంగుల సంఘం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**






సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆకస్మిక మరణం పట్ల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. బోధన్ పట్టణంలోని రాకసిపేట్ గ్రామ అభివృద్ధి కమిటీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు గైని రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ... నూర్జహాన్ తన జీవిత కాలమంతా అట్టడుగు పేద ప్రజల కోసం, కులమతాలకు అతీతంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు మరియు వికలాంగుల పక్షాన పోరాడారని కొనియాడారు. నూర్జహాన్ భౌతికంగా లేకపోయినా, ఆమె ఆచరించిన సిద్ధాంతాలు, ఆశయాలు ఎల్లకాలం ప్రజల్లో ఉంటాయని, ఆమె అడుగుజాడల్లో నడుస్తూ పేదలు, వికలాంగుల కోసం తమ జీవితాలను అంకితం చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎన్‌పీఆర్‌డీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. వికలాంగుల హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛనును రూ. 6 వేలకు, కేంద్ర ప్రభుత్వం రూ. 5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన వికలాంగులందరికీ అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు సదరం క్యాంపుల ద్వారా వచ్చిన పరికరాలను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్, జిల్లా కోశాధికారి రామ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, సహాయ కార్యదర్శి గోపాల్ గౌడ్, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సంగప్ప పటేల్, జనార్ధన్, సలీం, గౌస్, రేఖ, అంజలి, మోహన్, తిరుపతి, పోశెట్టి, దేవిదాస్, పిల్లల చాంద్, సావిత్రి, రాజవ్వ, అనూష, సాయిలు, హనుమాన్లు, బీరుగొండ తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**

భీంగల్ మున్సిపల్ చైర్మన్ బొదిరే నాగమణి స్వామి, వైస్ చైర్మన్ సంటి లతా నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ నేతృత్వంలో భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చాటిచెపుతూ, లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి ఈ పనులకు వారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ బొదిరే నాగమణి స్వామి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సాయం అందుతుందని, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన ఆదేశించారు. వైస్ చైర్మన్ సంటి లతా నర్సయ్య మాట్లాడుతూ, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట సతీష్, సందీప్ మరియు కాంగ్రెస్ నాయకులు బాలగంగాధర్, కర్నె గంగయ్య, కాపు కుమ్మరి హరీష్, మందుల కిరణ్, బైండ్ల మహేష్, ఒక మహేష్, మొండి దినేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఇంటి బాట పట్టిన గురుకుల విద్యార్థినులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**

వేసవి సెలవులు ప్రకటించడంతో బోధన్ పట్టణంలోని అచ్చన్‌పల్లి (సాలూర) మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో సందడిగా మారింది. వార్షిక పరీక్షల అనంతరం సెలవులు రావడంతో విద్యార్థినులు తమ కుటుంబ సభ్యులను కలిసేందుకు ఆతృతగా ఇంటి బాట పట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెలవుల కాలంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సెలవులను కేవలం వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా, తమ నైపుణ్యాలను పెంపొందించుకునేలా పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకోవడంలో గడపాలని ఆమె దిశానిర్దేశం చేశారు. తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని తమ పిల్లలను క్షేమంగా ఇళ్లకు తీసుకెళ్లారు. విద్యార్థినుల నిష్క్రమణతో పాఠశాల ప్రాంగణం కొంత సమయం సందడిగా మారి, ఆపై ప్రశాంతత నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ స్నేహితులు, ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికి సంతోషంగా పయనమయ్యారు.








## విద్యార్థుల ప్రతిభను అభినందించిన సర్పంచ్ మహబూబ్

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**



కమ్మర్ పల్లి మండలంలోని చౌట్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల వార్షిక ఫలితాలను గ్రామ సర్పంచ్ మహబూబ్ ప్రకటించారు. అనంతరం విద్యా సంవత్సరం మొత్తంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను గుర్తించి వారికి స్వర్ణ, రజత పతకాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహబూబ్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నిరంతర కృషితోనే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని, తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విశాల్, పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పెంట రమా, ఎస్‌డీసీ చైర్మన్ బాబయ్య, ఉపాధ్యాయులు మారుతి, గంగాకిషన్, తనుశ్రీ, మౌనిక, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అందుబాటులోకి ఇసుక పాయింట్లు: బోధన్ తహసీల్దార్ విట్టల్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**



బోధన్ మండలంలోని కల్దుర్కి, సిద్దాపూర్ గ్రామాల్లోని ఇసుక పాయింట్లు శుక్రవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని తహసీల్దార్ విట్టల్ తెలిపారు. ఇసుక కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మన ఇసుక - వాహనం' వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ ప్రక్రియను చేపట్టిందని, ఇసుక కావాల్సిన వారు తప్పనిసరిగా ఆ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే ఇసుకను విక్రయిస్తామని ఆయన స్పష్టం చేస్తూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఒక యూనిట్ ఇసుకను రూ. 212కు, ప్రైవేట్ నిర్మాణాల కోసం ఒక యూనిట్ ఇసుకను రూ. 733కు అందజేస్తామని వివరించారు. ప్రజలు ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బేతాళ స్వామి జాతరలో అపస్మారక స్థితికి గురైన బాలిక...వెంటనే స్పందించిన టౌన్ సీఐ శ్రీధర్

**బాన్సువాడ, ఏప్రిల్ 23(డిడి9 వార్త):**

బాన్సువాడలో నిర్వహిస్తున్న బేతాళ స్వామి జాతరలో గురువారం భక్తుల రద్దీ భారీగా పెరిగింది. ఈ సందర్భంగా బాన్సువాడ గౌలిగూడకు చెందిన శైలజ అనే బాలిక అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి కుప్పకూలింది.అక్కడే విధుల్లో ఉన్న టౌన్ సీఐ శ్రీధర్ మరియు పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.బాలికను తమ పోలీసు వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించి, తక్షణమే వైద్య చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. పోలీసుల సమయోచిత చర్యలతో బాలికకు వేగంగా వైద్య సహాయం అందడంతో, స్థానికులు పోలీస్ సిబ్బందిని అభినందించారు. జాతర సమయంలో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషించారు.






## ఉచిత గాలికుంటు టీకాలు

- **మండల పశువైద్యులు సురేష్ కుమార్**

**నిజామాబాద్ పోతంగల్**
**ఏప్రిల్ 23 (డిడి9 వార్త)**

నిజామాబాద్ పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం,జల్లాపల్లి తాండ లో ఆవు, గేదె జాతి మూడు నెలల పైన వయసు గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల పంపిణీ చేయటం జరిగింది. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచులు షేక్ దస్తగిరి,ధరావత్ రాజు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో పశువైద్యులు సురేష్ కుమార్ మాట్లాడుతూ పశు పెంపకం దారులు తమ పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు తప్పనిసరిగావేయించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య సిబ్బంది సుధీర్ గౌడ్, అటెండర్లు భూమేష్, సతీశ్,భాస్కర్,గోపాలమిత్ర నగేశ్ పశు పెంపకందార్లు పాల్గొన్నారు.



## బోధన్ రైల్వే స్టేషన్‌ను కీలక లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తాం

- **డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా,**
**ఏప్రిల్ 23(డీడీ9 వార్త) :**

బోధన్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. గురువారం బోధన్ రైల్వే స్టేషన్‌లో హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా సమీక్షించారు. బోధన్ ప్రాంతాన్ని కీలక లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చే దిశగా గూడ్స్ యార్డ్ పునర్నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక పరిశ్రమలు, వ్యవసాయ వాణిజ్య రంగానికి ఊతమిచ్చేలా సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రైల్వే శాఖ అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ విభాగాల సీనియర్ అధికారులతో కలిసి మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌ను డీఆర్ఎం ఖరారు చేశారు. ఈ మార్పుల ద్వారా భవిష్యత్తులో బోధన్ ప్రాంత ఆర్థికాభివృద్ధికి రైల్వే శాఖ మరింత తోడ్పాటును అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.




# ఫిఫా వరల్డ్ కప్‌లో రాజకీయ ప్రకంపనలు.. ఇరాన్ స్థానంలో ఇటలీకి అవకాశం?

- **ఫిఫా వరల్డ్ కప్ నుంచి ఇరాన్ వైదొలగాలని నిర్ణయం**
- **ఇరాన్ స్థానంలో ఇటలీని ఆడించాలని అమెరికా ప్రతిపాదన**
- **పోప్‌పై ట్రంప్ వ్యాఖ్యలతో చెలరేగిన అంతర్జాతీయ వివాదం**
- **ఇటలీ ప్రధానితో సంబంధాలు చక్కదిద్దేందుకే ఈ ప్రయత్నం**
- **అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా దక్కనున్న అవకాశం?**

**డిడి9 వార్త:**

ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ అయిన ఫిఫా వరల్డ్ కప్‌కు రాజకీయ వివాదాల సెగ తగిలింది. జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్‌లో అర్హత సాధించిన ఇరాన్ జట్టును తప్పించి, దాని స్థానంలో ఇటలీని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి ఒకరు ఫిఫాకు సూచించినట్లు సంచలన వార్తలు వెలువడుతున్నాయి. పోప్ లియో XIVపై ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో చెలరేగిన రాజకీయ వివాదాన్ని చల్లార్చేందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.

అమెరికా వలస విధానం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలపై పోప్ లియో XIV వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా వేదికగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పోప్ నేరాలను అరికట్టడంలో బలహీనంగా ఉన్నారు. విదేశాంగ విధానంలో ఘోరంగా విఫలమయ్యారు" అని ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపింది. ముఖ్యంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ వ్యాఖ్యలను "ఆమోదయోగ్యం కాదు" అని తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామంతో ట్రంప్, మెలోనీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ వరల్డ్ కప్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పాలో జంపొల్లి మాట్లాడుతూ.. "వరల్డ్ కప్‌లో ఇరాన్ స్థానంలో ఇటలీని చేర్చాలని నేను ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోలకు సూచించాను. నేను ఇటలీ సంతతికి చెందినవాడిని. అమెరికా ఆతిథ్యం ఇచ్చే టోర్నమెంట్‌లో అజూరీ (ఇటలీ జట్టు) ఆడటాన్ని చూడాలన్నది నా కల. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఇటలీకి ఆ అర్హత ఉంది" అని వివరించారు.



విచిత్రమేమిటంటే వరుసగా మూడుసార్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో ఇటలీ విఫలమైంది. ప్లేఆఫ్‌లో బోస్నియా హెర్జెగోవినా చేతిలో ఓడిపోయి చరిత్రలో తొలిసారిగా ఇలాంటి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మరోవైపు ఇరాన్ వరుసగా నాలుగోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. అయితే, అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ గ్రూప్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు మార్చాలని మొదట ఫిఫాను కోరింది. ఆ తర్వాత దేశంపై జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా టోర్నమెంట్‌లో పాల్గొనలేమని ఇరాన్ క్రీడా మంత్రి అహ్మద్ దొన్యమాలి అధికారికంగా ప్రకటించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "ఇరాన్ జట్టుకు ప్రపంచకప్‌లోకి స్వాగతం. కానీ, వారి ప్రాణ భద్రత దృష్ట్యా వారు ఇక్కడ ఉండటం సబబు కాదని నేను భావిస్తున్నాను" అని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఇరాన్ తన తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో సోఫై స్టేడియంలో ఆడాల్సి ఉంది. కానీ తాజా పరిణామాలతో అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా తలుపులు తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## బ్యాటింగే మా కొంప ముంచింది.. ఓటమిపై రిషభ్ పంత్ తీవ్ర ఆవేదన

- **రాజస్థాన్ రాయల్స్ చేతిలో లక్నో సూపర్ జెయింట్స్ ఓటమి**
- **ఇది లక్నో జట్టుకు వరుసగా నాలుగో ఓటమి**
- **బ్యాటింగ్ వైఫల్యమే ఓటమికి కారణమన్న కెప్టెన్ రిషభ్ పంత్**
- **తక్కువ స్కోరును కాపాడిన బౌలర్లను ప్రశంసించిన రియాన్ పరాగ్**

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓటముల పరంపర కొనసాగుతోంది. బుధవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 40 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇది ఆ జట్టుకు వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. మ్యాచ్ అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ, జట్టు బ్యాటింగ్ ప్రదర్శన తీవ్ర నిరాశకు గురిచేసిందని, ఓటమికి ఇదే ప్రధాన కారణమని అంగీకరించాడు.

లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎల్ఎస్‌జీ 18 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (55) ఒంటరి పోరాటం చేసినప్పటికీ, కెప్టెన్ రిషభ్ పంత్ డకౌట్‌గా వెనుదిరగడంతో పాటు ఇతర బ్యాటర్లు విఫలమవ్వడంతో ఓటమి తప్పలేదు. "మా ఓటమికి బ్యాటింగే కారణం. ఒక జట్టుగా, ఒక గ్రూప్‌గా మేం తీవ్ర నిరాశలో ఉన్నాం. సమాధానాలు బయట కాదు, మాలోనే వెతుక్కోవాలి" అని పంత్ వ్యాఖ్యానించాడు.

బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికీ, ఒక బ్యాటింగ్ యూనిట్‌గా తాము విఫలమయ్యామని పంత్ అంగీకరించాడు. అయినప్పటికీ, జట్టు పుంజుకోగలదన్న నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. మరోవైపు, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాట్లాడుతూ తాము బ్యాటింగ్‌లో కొన్ని పరుగులు తక్కువ చేసినప్పటికీ, బౌలర్లు అద్భుతంగా రాణించి విజయాన్ని అందించారని ప్రశంసించాడు. ఈ విజయంతో రాజస్థాన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది.



## మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా: వైభవ్ సూర్యవంశీ

- **ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్**
- **సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు**
- **వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ**

**డిడి9 వార్త:**

రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.



## చెన్నై పేసర్ ముకేశ్ చౌదరి ఇంట విషాదం.. అండగా నిలిచిన ధోనీ

- **సీఎస్‌కే పేసర్ ముకేశ్ చౌదరి తల్లి అనారోగ్యంతో కన్నుమూత**
- **ముకేశ్‌కు అండగా నిలిచిన ధోనీ.. ఆసుపత్రికి వెళ్లి పరామర్శ**
- **తల్లి అంత్యక్రియలు ముగించి తిరిగి జట్టుతో చేరిన ముకేశ్**
- **గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ.. నెట్స్‌లో తీవ్రంగా సాధన**

**డిడి9 వార్త:**

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) శిబిరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ జట్టు యువ ఫాస్ట్ బౌలర్ ముకేశ్ చౌదరి తల్లి ప్రేమ్ దేవి మంగళవారం కన్నుమూశారు. గతేడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, ముంబైలోని టాటా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే సీఎస్‌కే యాజమాన్యం, ఆటగాళ్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దైనిక్ భాస్కర్ కథనం ప్రకారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ముగిసిన వెంటనే ముకేశ్ తన స్వస్థలమైన రాజస్థాన్‌లోని భిల్వారాకు హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. తన అన్న డాక్టర్ రాజేశ్ చౌదరితో కలిసి తల్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషాద సమయంలో ముకేశ్‌కు కెప్టెన్ ఎంఎస్ ధోనీ అండగా నిలిచిన తీరు అందరినీ కదిలించింది. ధోనీ నిరంతరం ముకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ ధైర్యం చెప్పడమే కాకుండా, సమయం తీసుకుని ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించాడు. కష్టకాలంలో తోటి ఆటగాడికి అండగా నిలిచి ధోనీ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నాడు.

తల్లి అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం ముకేశ్ చౌదరి తిరిగి జట్టుతో చేరినట్టు సమాచారం. అయితే, అతను చిన్న విరామం తీసుకుని పంజాబ్ కింగ్స్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని సమాచారం. ఈ సీజన్‌లో ముకేశ్ ఇప్పటివరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడాడు.




**నెట్స్‌లో ధోనీ సాధన**

మరోవైపు గాయం కారణంగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ఎంఎస్ ధోనీ, తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. టోర్నమెంట్‌కు ముందు పిక్కల కండరాల నొప్పితో బాధపడిన ధోనీ, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. మంగళవారం జరిగిన ట్రైనింగ్ సెషన్‌లో అతను పూర్తిస్థాయిలో పాల్గొని వికెట్ కీపింగ్, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. బుధవారం కూడా దాదాపు గంటపాటు నెట్స్‌లో ఫాస్ట్ బౌలర్లు, త్రోడౌన్ స్పెషలిస్టుల బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. కొన్ని బంతులను సిక్సర్లుగా మలిచినప్పటికీ, మరికొన్నింటిని కనెక్ట్ చేయడంలో ఇబ్బంది పడ్డాడు. ధోనీ ఫిట్‌నెస్‌పై మెడికల్ టీం, ధోనీ పూర్తి సంతృప్తిగా ఉన్నప్పుడే అతని పునరాగమనం ఉంటుందని బౌలింగ్ కోచ్ ఎరిక్ సైమన్స్ తెలిపాడు. ఇదే సమయంలో మైదానంలో ఐపీఎల్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఏఐ (AI) రోబోటిక్ డాగ్‌ను చూసిన ధోనీ, దానితో సరదాగా గడిపాడు. దానితో సైగలు చేస్తూ ఆడించడం అందరినీ ఆకట్టుకుంది.

# దీపికా పదుకొణె ప్రకటన.. అల్లు అర్జున్ 'రాకా'పై టీమ్ క్లారిటీ

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీ కి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది.
మోటివేషన్ అంటే అది కాదు: పూరి జగన్నాథ్

సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు? అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.







# నెపోటిజంపై శివాత్మిక రాజశేఖర్ బోల్డ్ కామెంట్స్..

టాలీవుడ్ సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్ నట వారసురాలిగా 'దొరసాని' చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు శివాత్మిక రాజశేఖర్. తొలి సినిమాతోనే తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్ పరంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శివాత్మిక, సినీ పరిశ్రమలో నెపోటిజం, అవకాశాల వెనుక ఉన్న చేదు నిజాలను బయటపెట్టారు.
శివాత్మిక మాట్లాడుతూ..'రాజశేఖర్ గారి అమ్మాయి అంటే దర్శకుడి దగ్గరకు వెళ్లేందుకు ఈజీగా యాక్సెస్ దొరుకుతుంది. కానీ, ఆ తర్వాత అవకాశం రావడం అనేది కేవలం నా ప్రతిభ మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. నెపోటిజం అనేది మొదటి సినిమా వరకే పనికొస్తుంది, ఆ తర్వాత ప్రతి సినిమా మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. 'దొరసాని' వల్ల నాకు 'రంగమార్తాండ'లో అవకాశం వచ్చిందే తప్ప, నా బ్యాక్‌గ్రౌండ్ వల్ల కాదు. నేను రాజశేఖర్ కూతురిని అని తెలిసి కూడా కొన్ని ప్రాజెక్టుల నుంచి నన్ను తప్పించి మరొకరిని తీసుకున్నారు. దానికి కారణం ఏంటని అడిగితే.. నాకంటే వాళ్లకు సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని చెప్పారు. కేవలం ఇన్‌స్టాగ్రామ్ నెంబర్స్ ఆధారంగా నటీనటులను ఎంపిక చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. నేను నటిని, కంటెంట్ క్రియేటర్‌ని కాదు. యాక్టింగ్ వచ్చా? లేదా? ఆ పాత్రకు సూట్ అవుతానా? లేదా? అనేది చూడాలి కానీ ఫాలోవర్లను కాదు' అని చెప్పుకొచ్చింది.

# ఇలా జరుగుతుందని అస్సలు అనుకోలేదు..

మలయాళీ ముద్దుగుమ్మ మమితా బైజు, 'ప్రేమలు' సినిమాతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారి, ఇప్పుడు సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో వరుస ప్రాజెక్టులతో ఈ భామ ఫుల్ బిజీగా గడుపుతోంది. తాజాగా మమిత ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, త్వరలో విడుదల కాబోతున్న సినిమాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. దళపతి విజయ్ హీరోగా, హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రంలో మమితా బైజు ఒక కీలక పాత్ర పోషించింది. పూజా హెగ్డే హీరోయిన్‌గా, ప్రియామణి ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమా సెన్సార్ సమస్యల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఈ సినిమా ఆన్‌లైన్‌లో లీక్ అవ్వడంపై మమిత తీవ్ర విచారం వ్యక్తం చేసింది. "ఈ విషయం నా తమ్ముడి ద్వారా తెలిసినప్పుడు మొదట నమ్మలేదు.
సోషల్ మీడియాలో అబద్ధాలు కూడా ప్రచారం అవుతుంటాయని అనుకున్నా. కానీ అది నిజమని తెలిసి చాలా బాధపడ్డాను. టీమ్ అంతా ఎంతో కష్టపడి చేసిన సినిమా ఇలా లీక్ అవ్వడం దురదృష్టకరం" అని ఆమె పేర్కొంది. ధనుష్ సరసన నటిస్తున్న 'కర' సినిమా గురించి చెబుతూ ఆయన డెడికేషన్‌ను మమిత కొనియాడింది. "ధనుష్ గారు పని పట్ల చూపించే నిబద్ధత అద్భుతం. రోజంతా కష్టపడినా ఆయన ముఖంలో అలసట కనిపించదు. రొటీన్ పాత్రలు చేయకుండా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్తదనాన్ని అందించడానికి ఆయన ప్రయత్నిస్తారు. నాకు ఆయన నటించిన 'వీఐపీ' అంటే చాలా ఇష్టం" అని చెప్పుకొచ్చింది. కేవలం ఈ రెండు సినిమాలే కాకుండా, ఇదాయం మురళి, కోలీవుడ్ స్టార్ సూర్య సరసన విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో కూడా మమిత హీరోయిన్‌గా నటిస్తోంది. తనదైన సహజసిద్ధమైన నటనతో, క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ 'ప్రేమలు' బ్యూటీ, రాబోయే రోజుల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదగడం ఖాయంగా కనిపిస్తోంది.



# మరోసారి కలిసొస్తారా!

సిద్ధార్థ్ త్రిష జోడీ అనగానే తెలుగు ప్రేక్షకులకు 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' సినిమానే గుర్తొస్తుంది. ఆ సినిమా అంతగా ప్రభావం చూపింది. మరోసారి ఆ జోడీ కలిసి తెరపైకొచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో ప్రేమకథతో ప్రేక్షకులపై తిరుగులేని ప్రభావం చూపించిన ఈ జంట కోసం ప్రస్తుతం ప్రేమ, పెళ్లితో ముడిపడిన ఓ కథ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దిల్‌రాజు నిర్మాణంలో ఓ కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు సమాచారం. 'భర్తగా మారకు బ్యాచిలరూ...' అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. నిర్మాణ వర్గాలు ఈ సినిమాపై అధికారికంగా ఎలాంటి వివరాల్ని వెల్లడించలేదు. దీనిపై స్పష్టత రావాలంటే మరికొన్నాళ్లు ఆగాల్సిందే.



# త్రివిక్రమ్‌వెంకటేష్ మూవీలో ఊహించని ట్విస్ట్ .. హర్షవర్ధన్ ఔట్ గురువు కోసం రంగంలోకి తమన్!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రం ఇప్పుడు ఫిలిం నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన మార్పు చోటు చేసుకుంది. ఈమూవీకి మొదట మ్యూజిక్ డైరెక్టర్‌గా హర్షవర్ధన్ రామేశ్వర్‌ను అనుకున్నప్పటికీ, అనూహ్యంగా ఆయన తప్పుకోవడంతో సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ రంగంలోకి దిగినట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది. అయితే, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్‌కు, దర్శకుడు త్రివిక్రమ్‌కు మధ్య కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని, అందుకే ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని సమాచారం. త్రివిక్రమ్‌తో తమన్‌కు ఉన్న సాన్నిహిత్యం గురించి అందరికీ తెలిసిందే. తన గురువుగా భావించే త్రివిక్రమ్ అడిగిన వెంటనే, తమన్ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'అల వైకుంఠపురములో', 'అరవింద సమేత' వంటి చిత్రాల సాంగ్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.
అయితే, ఈ మార్పుపై సోషల్ మీడియాలో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. గతంలో పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో కూడా ఇలాగే జరిగింది. చివరి నిమిషంలో దేవిశ్రీ ప్రసాద్ తప్పుకోగా తమన్ సంగీతం అందించారు. కానీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' విషయంలోనూ అదే సీన్ రిపీట్ కావడంతో, వెంకటేష్ హిట్ కొట్టడం కష్టమేమోనని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, త్రివిక్రమ్‌తమన్ కాంబినేషన్ అంటేనే మ్యూజికల్ హిట్ గ్యారెంటీ అని, శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుందని మరికొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో వెంకటేష్ మార్క్ ఫ్యామిలీ ఎమోషన్స్, త్రివిక్రమ్ మార్క్ డైలాగ్స్‌తోడైతే రికార్డులు తిరగరాయడం ఖాయమని



ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

# మోటివేషన్ అంటే అది కాదు

ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఇప్పటికే ఎన్నో ఆసక్తికర విశేషాలు పంచుకున్న సంగతి తెలిసిందే. కొంత బ్రేక్ తర్వాత మళ్లీ ప్రారంభించారు. తాజాగా 'సెల్ఫ్ మోటివేషన్' గురించి మాట్లాడారు. ఆ సంగతులు ఆయన మాటల్లోనే.. ''మనం ఏదైనా మన కోసమే చేయాలి. ఎవరో చెప్పారని, బలవంతం చేస్తున్నారని చేయకూడదు. మన భవిష్యత్తు, మన ఎదుగుదల కోసం చేయాల్సినవి కచ్చితంగా చేసి తీరాలి. ఒకవేళ మీ మూడ్ బాగోలేకపోయినా.. మీరు పరాజయంలో ఉన్నా చేయాల్సిన పని ఆపకూడదు. సెల్ఫ్‌మోటివేషన్ రెండు రకాలు. ఒకటి ఎక్స్‌టర్నల్ మోటివేషన్, రెండోది ఇంటర్నల్ మోటివేషన్. రివార్డులు, ప్రశంసల కోసమో.. ఒత్తిడితోనో చేసేది ఎక్స్‌టర్నల్ మోటివేషన్. నీ లక్ష్యాలు, విలువలు కోసం చేసేది ఇంటర్నల్ మోటివేషన్. రోజూ తెల్లవారుజామున ఎవరో లేపితే లేవడం ఎక్స్‌టర్నల్ మోటివేషన్. నీకు నీవుగా లేస్తే సెల్ఫ్ మోటివేషన్. మిమ్మల్ని మీరు ఉత్తేజపరుచుకునేందుకు నాలుగు విషయాలు ముఖ్యం. స్పష్టమైన లక్ష్యం, ప్రయోజనం, క్రమశిక్షణ, స్థిరత్వం. ఇతరుల నుంచి స్ఫూర్తి పొందడాన్ని చాలామంది మోటివేషన్ అనుకుంటారు. కానీ కాదు''
''నువ్వు అలసిపోయినా, నిరాశలో ఉన్నా, ఎవరూ తోడు లేకపోయినా.. అనుకున్న పని పూర్తి చేయాలి. పని మానుకుని ఎవరూ మనల్ని ఫాలోఅప్ చేయరు. ఎవరూ రోజూ మనల్ని ఇన్‌స్పైర్ చేస్తూ ఉండరు. ట్రైనర్ వచ్చినా రాకపోయినా మీరు జిమ్‌కు వెళ్లాల్సిందే. జ్వరం ఉన్నా, గాయమైనా జిమ్‌కు వెళ్లి కాసేపు కూర్చోవడం సెల్ఫ్ మోటివేషన్. రోజూ చిన్న చిన్న గోల్స్ పెట్టుకోండి. పర్ఫెక్ట్ మూడ్ కోసం ఎదురుచూడొద్దు. మీ ప్రోగ్రెస్‌ను మీరు ట్రాక్ చేస్తూ ఉండండి. ఏ పనైనా ఎందుకు మొదలుపెట్టారో గుర్తుతెచ్చుకోండి. మీపై ఆధారపడిన అమ్మానాన్నల గురించి ఆలోచించండి. దేవుడు బయట నుంచి నీకు శక్తి ఇవ్వడు. దానిని నీలోనే దాచి పెట్టాడు. అందుకే దానిని నువ్వే బయటకు తీయాలి''



# నాని 'బ్లడీ రోమియో'కు బ్రేక్ ..

నేచురల్ స్టార్ నాని, స్టైలిష్ యాక్షన్ డైరెక్టర్ సుజీత్ కాంబినేషన్‌లో అనౌన్స్ అయిన 'బ్లడీ రోమియో' కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న అభిమానులకు షాకింగ్ న్యూస్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య సెట్స్ పైకి వెళ్లాల్సిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికి వచ్చేలా కనిపించడం లేదు. ఎందుకంటే నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో 'ది పారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. అయితే, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్స్ పదే పదే ఆలస్యం అవుతుండటమే ఇప్పుడు ఇతర ప్రాజెక్టులపై ప్రభావం చూపుతోంది. 'ది పారడైజ్' చిత్రాన్ని ముందుగా 2026 సమ్మర్‌లో విడుదల చేయాలనుకున్నారు. కానీ అది కాస్తా ఆగస్టు 21కి మారింది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ తేదీకి కూడా సినిమా సిద్ధమవ్వడం కష్టమేనని టాక్.
నాని తన పూర్తి కాల్ షీట్స్ 'ది పారడైజ్'కే కేటాయించాల్సి రావడంతో, సుజీత్ దర్శకత్వంలో రావాల్సిన 'బ్లడీ రోమియో' పట్టాలెక్కడం మరింత ఆలస్యం కానుంది. నిజానికి 'బ్లడీ రోమియో'ను 2026 చివరి నాటికి థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ భావించారు. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఈ




సినిమా షూటింగ్ మొదలవ్వడమే గగనంగా మారింది. దీనివల్ల 2026 టార్గెట్ పూర్తిగా మిస్ అయ్యి, సినిమా 2027కి వాయిదా పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నాని నుంచి ఒకే ఏడాది రెండు భారీ సినిమాలు చూడాలని ఆశపడ్డ ఫ్యాన్స్‌కు ఇది నిజంగా నిరాశ కలిగించే విషయమే. అయితే సుజీత్ తన స్క్రిప్ట్‌పై మరికొంత వర్క్ చేసేందుకు ఈ సమయాన్ని వాడుకోనున్నారని సమాచారం.

# రానా, అక్షయ్ కుమార్ హీరోలుగా హిస్టారికల్ థ్రిల్లర్?

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ చందు మొండేటి మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నారు. 'కార్తికేయ 2', 'తండేల్' వంటి విజయాల తర్వాత, ఆయన ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్‌తో జతకట్టడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో 'బేబీ' సినిమాలో కలిసి నటించిన రానా దగ్గుబాటి, అక్షయ్ కుమార్ ఇప్పుడు ఈ సినిమాలో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. చందు మొండేటి రూపొందించబోయే ఈ చిత్రంలో వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా అక్షయ్ కుమార్ ఇందులో ఒక పవర్ ఫుల్ రోల్ ప్లే చేయబోతున్నట్లు సమాచారం. అంతేకాదు, మరో టాప్ హీరో కూడా ఈ ప్రాజెక్టులో భాగమయ్యే అవకాశం ఉందని వినిపిస్తోంది.
ఈ సినిమా కథాంశం పురాతన నగరం ఉజ్జయిని నేపథ్యంలో సాగనుంది. చరిత్ర, పురాణాలు మరియు మిస్టరీ మేళవింపుతో



ఈ హిస్టారికల్ థ్రిల్లర్‌ను చందు మొండేటి తెరకెక్కిస్తున్నారు. 'కార్తికేయ 2'తో పురాణాలను ఆసక్తికరంగా చూపించిన ఆయన, ఈసారి అంతకంటే పెద్ద స్థాయిలో మ్యాజిక్ చేయబోతున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ (ధర్మ ప్రొడక్షన్స్) ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు.

# మెక్సికో ఈవెంట్‌లో 'వారణాసి' ప్రదర్శన..

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.
దీపికా పదుకొణె ప్రకటన.. అల్లు అర్జున్ 'రాకా'పై టీమ్ క్లారిటీ
మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్ తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరుకానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.

